ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 10 ఫిబ్రవరి 2025



సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాప్రభో..! బిల్లులకు మోక్షమెప్పుడో..?



నూలివీడులో ఇంకా బిల్లులు చేయని డంపింగ్ యార్డు

'ఐదేళ్ల పాలనలో.. మా ప్రభుత్వం ఎటువంటి కక్ష సాధింపులకు పాల్పడలేదు.. కులం, మతం.. పార్టీలతో సంబంధం లేకుండా.. అందరినీ సమాన దృష్టితో చూసి.. పాలన చేశాం..' ఇదీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నోటి వెంట పదేపదే వినిపించిన మాట. అయితే ఆయన మాటలకు, చేతలకు పొంతనే ఉండదు అనేందుకు ప్రత్యక్ష ఉదాహరణే... ఆరేళ్లుగా ఈ పెండింగ్ బిల్లుల వ్యథ. గత టీడీపీ ప్రభుత్వంలో నాయకులు అప్పో సప్పో చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.50 కోట్లకు పైగానే బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఆశలు చిగురించాయి.

- ఆరేళ్లుగా ఎదురుచూపులు
- జిల్లా వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు
- జగన్‌రెడ్డి కక్ష సాధింపునకు పరాకాష్ట
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న 2014-19 కాలంలో ఎందరో చోటా మోటా టీడీపీ నాయకులు లక్షల రూపాయలు అప్పులు చేసి గ్రామాల్లో సిమెంటురోడ్లు, డంపింగ్‌యార్డులు, ఫార్మేషన్ రోడ్లు, చెక్‌డ్యాంలు, నీరు-చెట్టు వంటి వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. తీరా 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పనులకు బి ల్లులు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టేసింది. దీంతో అప్పో సప్పో చేసి పనులు చేసిన నాయకులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. గత ఆరేళ్లుగా ఈ పనులకు బిల్లులు రాక.. అప్పులకు వడ్డీలు కడుతూ.. నరకం అనుభవిస్తున్నారు. కొందరు మొండిగా కోర్టును ఆశ్రయించినా.. ఫలితం లేదు. రావాల్సిన బిల్లుల్లో కొద్దో గొప్పో మాత్రమే వచ్చాయి. మిగిలిన వాటికోసం ఎదురు చూస్తున్నారు. ఇంకా కొన్నిచోట్ల, టీడీపీ నాయకులు పనులు చేస్తే.. దర్జాగా వైపీపీ నాయకులు బిల్లులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పనులు చేసి.. బిల్లులు రాని వాళ్ల కోసం.. అప్పట్లో చంద్రబాబునాయుడు.. తాము అధికారంలోకి రాగానే.. వడ్డీతో సహా చెల్లించి పనులు చేసిన వాళ్లను ఆర్థికంగా ఆదుకుంటామని ప్రకటించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి.. 8 నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ ఈ బిల్లులకు మోక్షం కలగలేదు. దీంతో జిల్లాలోని పెండింగ్ బిల్లుల బాధితులు... మహాప్రభో..! పెండింగ్ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారని అడుగుతున్నారు..

2017-18లో శెట్టిపల్లె గ్రామంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, ఆయన సోదరుడు విష్ణువర్ధన్‌రెడ్డిలు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో బీటీ రోడ్డు పనులు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఈ పనులకు బిల్లులు చేయకుండా నిలిపేసింది. దీంతో వీళ్లు కోర్టును ఆశ్రయించారు. ఈ పనులకు సంబంధించి రూ.68 లక్షలు గ్రామ పంచాయతీ ఖాతాలో జమ అయ్యాయి. ఈ డబ్బును వైసీపీ నాయకులకు చెల్లించారు. ఈ విషయమై ప్రస్తుతం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు స్థానిక టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై అధికారులు విచారించారు. యర్రమొరంపల్లె నుంచి మర్రిమేకుల పల్లె వరకు కోటి రూపాయలకు సంబంధించి రూ.27 లక్షల బిల్లు, చెరుకువాండ్లపల్లె నుంచి వల్లబండపల్లె వరకు కోటి రూపాయల పనికి రూ.22..50 లక్షలు, నరసారెడ్డిగారిపల్లె నుంచి బలిజపల్లె వరకు కోటి రూపాయల పనికి రూ.17 లక్షలు, రెడ్డిమల్లువారిపల్లె నుంచి కొత్తపల్లె బిడికి వరకు రూ.65 లక్షలకు గానూ..5.50 లక్షలు బిల్లులు పెట్టారు. 2018లోపు పనులు పూర్తయినా 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు.

మదనపల్లె డివిజన్‌లోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో 2014 నుంచి 2019 వరకూ చేపట్టిన నీరు- చెట్టు 265 పనులకు సంబంధించి రూ.18.70 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. నీరు-చెట్టు కింద చెరువుల పూడికతీత, చెరువులు, కుంటల్లో చెట్ల తొలగింపు, సప్లయ్‌చానల్ పునరుద్ధరణ, చెరువు కట్టలు బలపరచడం, కొత్తగా చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో పాటు పాతవాటికి మరమ్మతు పనులు చేపట్టారు. మొదట్లో చేపట్టిన పనులకు బిల్లులు మంజూరయ్యాయి. ఎన్నికల ముందు 2018-2019లో చేపట్టిన పనులకు బిల్లులు కాలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నీరు-చెట్టు పనులను నిలిపేయడమే కాకుండా... అప్పటికే చేపట్టిన బిల్లులు చెల్లించలేదు. దీంతో చాలా మంది కోర్టును ఆశ్రయించినా.. కొందరికి మినహా అందరికీ చెల్లించలేదు. అప్పటికే సీఎఫ్ఎంఎస్‌లో నమోదు చేసిన టోకెన్లను కూడా రద్దు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. తిరిగి 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అలాంటి వాటికి మళ్లీ ప్రాణం వచ్చింది. అప్పటికే కోర్టుకు వెళ్లి టోకెన్లు పొందిన వారికి సంక్రాంతికి ముందు రూ.10 లక్షల లోపు బిల్లులు ఉన్న కొందరికి మంజూరు కాగా, ఇంకా 233 పనులకు సంబంధించి సుమారు రూ.13కోట్ల విలువ చేసే బిల్లుల టోకెన్లను అప్‌లోడ్ చేయాల్సి వున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. కనిష్ఠంగా రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.9లక్షల లోపు విలువ చేసే పనులు ఈ పథకంలో చేపట్టారు.

పీలేరు మండలం బందార్లపల్లెకు చెందిన బాబురెడ్డి అనే టీడీపీ నాయకుడు 2019 మార్చి నుంచి జూన్ వరకు నాలుగు నెలల పాటు పీలేరు గ్రామ పంచాయతీకి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. కేవలం టీడీపీ నాయకుడు అనే కారణంతో ఆయనకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టారు. దాదాపు రూ.3 లక్షలు రావాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ.16,500 మాత్రమే ఎంబుక్ (ఎంబుక్ నంబరు 388/2019) రికార్డు చేశారు. ఈ బిల్లు నేటికీ ఆయనకు అందలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత... ఆయన మళ్లీ ప్రయత్నాలు మొదలుపెట్టారు. కలికిరి మండలంలో చెక్కిరవాండ్లపల్లెలో నీరు-చెట్టు పనులు రూ.10 లక్షలు, కలికిరి చెరువు రూ.20 లక్షలు, గుట్టపాలెం ఎల్లంపల్లె రూ.5లక్షలు, ఈతమానువడ్డెపల్లె చెక్‌డ్యాం రూ.10లక్షలు ఇలా మండలంలో సుమారు రూ.2 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

కలకడ మండలం గుడిబండ పంచాయతీలో జన్మభూమి కమిటీ ఆధ్వర్యంలో రూ.7.5 లక్షల వ్యయంతో ఎర్రవంక చెక్‌డ్యాం పనులు చేపట్టారు. 2018 ఆఖరులో ఈ పనులు పూర్తయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ బిల్లులు చెల్లించలేదు. దీంతో పనులు చేపట్టిన వాళ్లు కోర్టును సైతం ఆశ్రయించారు. అయినా ఇంకా తమకు కొంతమేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పనులు చేపట్టిన వారు వాపోతున్నారు.

గత టీడీపీ హయాంలో నీరుచెట్టు పథకం కింద రాజంపేట, కోడూరు నియోజకవర్గాల్లో ఐదు కోట్ల రూపాయల పైబడి పనులు చేసినా ఇంతవరకు బిల్లులు కాలేదు. గత జగన్ ప్రభుత్వం ఆ బిల్లులను నిలిపేసింది. రాజంపేట, కోడూరులో కలిపి దాదాపు అన్ని చెరువులు, కాలువలను నీరు చెట్టు పనుల కింద పూడికలు తీయడం, కాలువలు వెడల్పు చేశారు. ఉదాహరణకు.. పుల్లంపేట మండలం టి.కమ్మపల్లె గ్రామానికి రోడ్డుకు ఇరువైపులా 2 వేల మొక్కలను నాటి ట్యాంకర్ల ద్వారా ఏడాది పాటు నీరు పట్టారు. సుమారు 15 లక్షల బిల్లులు రాలేదు. అదే విధంగా రాజంపేట మండలంలోని పోలిచెరువు, తాళ్లపాక అస్తవరం, ఒంటిమిట్ట, ఆకేపాడు రెడ్డిపల్లె చెరువులకు నీరు-చెట్టు కింద చేపట్టిన పనులకు ఇప్పటికీ బిల్లులు రాలేదు.

గాలివీడు మండలంలో 2018లో సిమెంటు రోడ్లు, డంపింగ్ యార్డు, ఫార్మేషన్ రోడ్లు, చెక్‌డ్యాంలు, నీరు-చెట్టు వంటి పనులను టీడీపీ నాయకులు చేశారు. ఈ పనుల కోసం రూ.లక్షలు అప్పులు చేసి పనులను పూర్తి చేశారు. అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత.. టీడీపీ నాయకులు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. కొంతమంది కోర్టుకు వెళ్లి కొంత మేర బిల్లులు చేసుకున్నప్పటికీ చాలా మందికి ఇంకా బిల్లులు రాలేదు. కొన్ని పనులకు బిల్లులు మంజూరైనప్పటికీ అప్పటి వైసీపీ నాయకులు పట్టుబట్టి.. టీడీపీ నాయకులకు బిల్లులు రాకుండా.. అధికారులపై ఒత్తిడి తెచ్చారు. వివిధ రకాల పనులకు సంబంధించి రూ.7 కోట్ల మొత్తం వివిధ బ్యాంకుల్లో పడినప్పటికీ.. వాటిని విత్‌డ్రా చేసుకోకుండా.. బ్యాంకు అకౌంట్లను బ్లాక్ చేసినట్లు టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికీ ఆ డబ్బు బ్యాంకు అకౌంట్లలో నే ఉందని బాధితులు పేర్కొంటున్నారు. ఇవే కాకుండా.. ఇంకా రూ.ఐదు కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటుతున్నా.. ఇంకా ఆ బిల్లులు రాకపోవడంపై.. అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా తమ బిల్లులను నిలుపుదల చేసిందని, అయితే కూటమి ప్రభుత్వం కూడా ఇప్పటికీ బిల్లులు ఇవ్వకపోవడంతో ఏం చేయాలో అర్థం కాలేదని వాపోతున్నారు.

అప్పులు చేసి పనులు చేశాం..



2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పులు చేసి పలు రకాల అభివృద్ధి పనులు చేశా ము. ఆ పనులకు ఇప్పటికీ బిల్లులు రాలేదు. వైసీపీ ప్రభుత్వం మాకు బిల్లులు రాకుండా అడ్డుకుంది. మాకు దాదాపు రూ.30 లక్షలు బిల్లులు రావాల్సి ఉంది. దీంతో అప్పులకు వడ్డీ కట్టేందుకు.. అప్పులు చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

- పి.పార్వతమ్మ, మాజీ ఎంపీటీసీ నూలివీడు

కుమ్మరపల్లెలో విషాదం

అశ్రునయనాల మధ్య తండ్రితో పాటు చిన్నారుల అంత్యక్రియలు

7

రియల్ ఎస్టేట్ వ్యాపారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



'రియల్' వ్యాపారులకు సహకరిస్తాం

- జిల్లా కేంద్రంగా రాయచోటి కొనసాగుతుంది
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తాను ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాయచోటిలో ఆదివారం జరిగిన నియోజకవర్గ రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. రాయచోటి పట్టణ పరిధిలో కొత్తగా వెంచర్లు వేసేవారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్లతోపాటు అన్ని రకాల మౌలిక వసతులు తప్పక ఉండేటట్లు చూడాలన్నారు. జిల్లా కేంద్రాన్ని మారుస్తారనే వదంతులను నమ్మరాదని, తన ప్రాణం ఉన్నంత వరకు రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగిస్తానన్నారు. అందరికీ అనుకూలమైన ప్రాంతంలో నూతన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం రియల్ ఎస్టేట్ వ్యాపారులు మంత్రిని సన్మానించారు.

హైకోర్టు సీజేని కలిసిన ఎస్పీ



హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో ఎస్పీ విద్యాసాగర్

రాయచోటి టౌన్/ బి.కొత్తకోట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను ఆదివారం ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. హార్సిలీహిల్స్‌లో ఉన్న ప్రధాన న్యాయమూర్తిని ఎస్పీ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

తిరుగు ప్రయాణం : హార్సిలీహిల్స్ నుంచి బయలుదేరిన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తి క్రిష్ణమోహన్‌లకు ఆదివారం అధికారులు వీడ్కోలు పలికారు. మదనపల్లె, పలమనేరులలో నిర్మితమైన కోర్టు అదనపు భవనాల ప్రారంభోత్సవాల అనంతరం వారు హార్సిలీహిల్స్‌కు వచ్చారు. శనివారం రాత్రి పొద్దుపోయాక న్యాయమూర్తులు హార్సిలీహిల్స్ వాతావరణాన్ని ఆస్వాదిస్తూ రోడ్డు వెంబడి కాలినడకన తిరిగారు. ఆదివారం సాయంత్రం వారు తిరుగు ప్రయాణమయ్యారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హార్సిలీహిల్స్‌కు చేరుకుని బందోబస్తును పర్యవేక్షించారు. సీఐ జీవన్‌గంగానాథ్‌బాబు, ఎస్ఐలు నరసింహుడు, హరిహరప్రసాద్‌లతో పాటు పోలీసు అదనపు బలగాలు బందోబస్తులో పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాల్లో ఎకో టూరిజానికి ప్రాధాన్యం

- ప్రతి నియోజకవర్గంలో ఓ నగరవనం ఏర్పాటుపై సీఎం దృష్టి
- త్వరలో 905 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం వేలం
- అటవీశాఖలో ఏపీపీఎస్సీ ద్వారా 689 పోస్టుల భర్తీ
- అటవీ శాఖ రాష్ట్ర చీఫ్ చిరంజీవి చౌదరి



హార్సిలీహిల్స్‌లోని అటవీ ప్రాంగణంలో డీఎఫ్‌వోకు సూచనలిస్తున్న పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి

బి.కొత్తకోట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అటవీశాఖ ఆధీనంలోని పర్యాటక కేంద్రాల్లో ఆదాయాన్ని పట్టించుకోకుండా, లోకల్ ఎంప్లాయిమెంట్ వచ్చేలా, కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం (సీబీఈటీ)కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర అటవీ శాఖాధికారి, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటివ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) చిరంజీవి చౌదరి తెలిపారు. హార్సిలీహిల్స్‌లో ఫారెస్ట్ క్యాంపస్‌లో రూ.40లక్షలతో ఆధునీకరించిన గెస్ట్‌హౌస్‌లను ఆదివారం ఆయన ప్రారంభించారు. హిల్స్‌లో పర్యాటకులను ఆకర్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలిచ్చారు. అనంతరం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫారెస్ట్, నాన్‌ఫారెస్ట్ భూములలో 50శాతం మొక్కలను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికి 30 శా తంలో ఉన్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టుబడిన 5300 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం తిరుపతిలోని సెంట్రల్ గోడౌన్‌లో నిల్వ ఉందని, దానిలో 905 మె ట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని వచ్చే నెలలో వేలం వేస్తామని, ఈ వేలం ద్వారా సుమారు రూ.350 కోట్లు వస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో అటవీశాఖకు రూ.600 కోట్లు కేటాయించారని, రూ.900 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, చింతపల్లి, పాడే రు తదితర ప్రాంతాలతో కూడిన క్లస్టర్‌లో కాఫీ తోటలు కర్నాటకలోని కూర్గ్‌లాంటి సంప్రదాయ ప్రదేశాలతో కాకుండా, నాన్‌ట్రెడిషనల్ క్లస్టర్‌లలో ప్రపంచ రికార్డు సాధించిందన్నారు. అక్కడ 2.25 లక్షల ఎకరాలలో కాఫీతోటలు ఉన్నాయన్నారు.

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో నగరవనాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి పెట్టారన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 61 చోట్ల నగరవనాలు ఏర్పాటు చేశామని, మరో 12 ప్రాంతాల్లో త్వరలో ఏర్పాటు చేయబోతున్నామన్నారు. వీటి కోసం కేంద్రం రూ.2 కోట్లు ఇస్తుందని, నగరానికి 10 కి.మీ. లోపల న్యాచురల్ వాతావరణాన్ని క్రియేట్ చేస్తూ ప్రజలు ఇక్కడ ఉపశమనం పొందేలా నగరవనాలను తీర్చిదిద్దుతామన్నారు. వేసవిలో అటవీ ప్రాంతం తగలపడకుండా స్థానికులు సహకరించాలని ఆయన కోరారు. ఫైర్‌వాచర్స్‌ను నియమించుకోవడానికి తగినన్ని నిధులు లేవన్నారు. 340 మీటర్ల లోపల ప్రమాదం జరిగితే ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి అటవీ సిబ్బందికి సమాచారం వస్తుందని వెంటనే స్పందించడం జరుగుతుందన్నారు. హార్సిలీహిల్స్‌లో అభివృద్ధి పనులకు మరిన్ని నిధులను కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి కన్సర్వేటర్ సెల్వం, డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్, సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్ శివకుమార్, రేంజ్ ఆఫీసర్ జయప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అరటి అ'ధర'హో

- కిలో రూ.22
- రికార్డు స్థాయిలో ధరలు
- అరటి రైతుకు భారీ లాభాలు



అరటి గెలలు


రాజంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అరటి పంటకు పెట్టింది పేరైన రాజంపేట డివిజన్‌లో ప్రస్తుతం అరటి ధరలు ఆకాశాన్నంటాయి. కిలో అరటి ఏకంగా రూ.22 పలుకుతోంది. మొన్నటివరకు కిలో రూ.15 వరకు ఉన్న ధర ఒక్కసారిగా రూ.22 పెరగడంతో అరటి రైతులకు భారీ లాభాలు చేకూరనున్నాయి. దీనివల్ల ఎకరాకు అరటి రైతు సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం పొందనున్నారు. మామూలుగా రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో 30 వేల ఎకరాల్లో అరటి సాగవుతోంది. ఒక్కో ఎకరాకు వెయ్యి నుంచి 1200 అరటి చెట్లను నాటుతారు. ఒక ఎకరా సాగుకు లక్షన్నర వరకు ఖర్చు అవుతోంది. గెలలు బాగా పండితే 15 నుంచి 25 కిలోల వరకు బరువు ఉంటాయి. అయితే గెల పెద్దదిగా ఉండి 20 కిలోలు ఉంటే గెలకు 500 వస్తోంది. అదే 15 కిలోల బరువు ఉంటే రూ.350 వరకు ఆదాయం వస్తోంది. ఈ విధంగా ఎకరాకు 900 చెట్లు గెలలు వేసినా రూ.4.50 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఖర్చులు పోనూ రూ.2 లక్షల పైబడి రైతుకు మిగులుతోంది.

ప్రస్తుతం అరటి పంట తక్కువగా ఉంది. అన్‌సీజన్ కావడంతో కాయలు తక్కువగా ఉండడంతో ధరలు ఆకాశాన్నంటాయి. రెండు నెలల కిందట వరకు రూ.15 ఉన్న ధరలు ఏకంగా రూ.22కు చేరాయి. మామూలుగా నవంబరు, డిసెంబరు మాసాల్లో అరటి బాగా దిగుబడి ఉన్న సమయంలో డిమాండ్ తక్కువగా ఉండి రేట్లు లేకుండా ఉన్నాయి. ఇప్పుడు కాయలు తగ్గిపోవడంతో ఒక్కసారిగా రేట్లు పెరిగాయి. రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో 30 వేల ఎకరాల్లో అరటి పండుతోంది. రాజంపేట మండలంలోని ఆకేపాడు ఏరియాలోని సుమారు 20 గ్రామాలు అరటి పంటపైనే ఆధారపడి ఉన్నాయి. నిత్యం ఈ చుట్టుపక్కల 30 పల్లెల నుంచి అరటిని ఎగుమతి చేస్తుంటారు. ఇక్కడ ప్రధాన జీవనాధారం అరటి పంటే. ఇక్కడి నుంచి కనీసం నిత్యం 5 లారీల వరకు ఇతర ప్రాంతాలకు అరటి పంటను ఎగుమతి చేస్తుంటారు. తదనంతరం చిట్వేలి మండలంలోని నగిరిపాడు, పెద్దూరు, మైలపల్లె, నాగవరం, జెట్టివారిపల్లె, కందులవారిపల్లె, కోడూరు, ఉర్లగట్టుపోడు, ఓబులవారిపల్లె, బొమ్మవరం, టి.కమ్మపల్లె, గొబ్బూరువారిపల్లె, చిన్నఓరంపాడు, పుల్లంపేట ప్రాంతాల్లో ఈ రెండు నియోజకవర్గాల్లో అరటి పంటను సాగుచేయనివారు ఉండరు. ప్రస్తుతం ధరలు బాగా ఉండడంతో అరటి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అరటి కాయలను లారీకి లోడ్ చేస్తున్న కూలీలు


దిగుబడి లేనందునే ధరలు..



ప్రస్తుతం కాయలు దిగుబడి లేనందునే ధరలు బాగున్నాయి. ప్రస్తుతం కాయలన్నీ అయిపోయాయి. గత ఐదు నెలలుగా ఉన్న కాయలన్నింటిని కోయడం జరిగింది. ప్రస్తుతం అన్ సీజన్. అందువల్ల కాయలు తక్కువగా ఉండడం వల్ల రేట్లు ఉన్నాయి. ఈ సీజన్‌లో ఏకంగా రూ.22 పలకడంతో అరటి రైతుకు లాభాలు బాగా వచ్చే అవకాశం ఉంది.

- బాలయ్య, రైతు, మన్నూరు, రాజంపేట

రూ.22 పలకడం ఆనందంగా ఉంది..



ఏకంగా కిలో అరటి రూ.22 పలకడం ఆనందదాయకం. దీనివల్ల అరటి రైతుకు మంచి చేకూరుతుంది. మూడేళ్లుగా వర్షాలు లేక ఇబ్బంది పడే రైతులకు ప్రస్తుతం పెరిగిన ధరలు ఆనందింపజేస్తోంది. నేను కూడా ఐదెకరాల్లో అరటి పంటను సాగు చేస్తున్నాను. ఈ ధర నాకు లాభం చేకూర్చుతుందని ఆశిస్తున్నా.

- శంకరయ్య, రైతు, గొబ్బూరువారిపల్లె, ఓబులవారిపల్లె

రైతులకు ఊరట..



రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో సుమారు 10 వేల మంది అరటి రైతులు ఉన్నారు. ధరలు పెరగడం వల్ల వీరందరికి ఉపయోగం చేకూరుతుంది. ప్రస్తుత సమయంలో ధరలు కిలో ఏకంగా రూ.22 పలకడం వల్ల గెలకు కనీసం 350-500 వరకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ప్రస్తుత సీజన్‌లో ఇంత పెద్దఎత్తున ధరలు పలకడం అరుదుగా జరుగుతోంది.

- సుబ్రమణ్యంనాయుడు, రైతు, మిట్టమీదపల్లె, రాజంపేట

నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

● కేంద్రాలు 78, విద్యార్థులు 14,508

● ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల పర్యవేక్షణలో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇవన్నీ నేరుగా జిల్లా, రాష్ట్ర కార్యాలయాలకు అనుసంధానమై ఉంటాయని, ఉన్నత స్థాయిలో నిర్వహణను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 10వ తేది నుంచి జనరల్ కోర్సులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభమవుతాయి. 19వ తేదీ వరకు షెడ్యూల్ ఉంది. నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. కాగా జనరల్ 78 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. 14508 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

సొంత కళాశాలల్లోనే..

ఇంటర్ ప్రయోగ పరీక్షల్లో జంబ్లింగ్ విధానం అమలులో లేదు. మూడేళ్ల క్రితమే తొలగించారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలల్లోనే పరీక్షలు రాస్తారు. తక్కువ విద్యార్థులున్న కళాశాలలను సమీపంలోని వాటితో కలిపి నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్ఐఓ కన్వీనరుగా డీఈసీ కమిటీ, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో పాటు ప్రత్యేకాధికారిగా జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పర్యవేక్షించనున్నారన్నారు.

గంట ముందుగా ప్రశ్నపత్రం

ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రం ఆధారంగా పరీక్షలు నిర్వహిస్తారు. సంబంధిత పరీక్ష కేంద్రం ముఖ్య పర్యవేక్షణాధికారికి గంట ముందుగా ప్రశ్నాపత్రం బోర్డు నుంచి వస్తుంది. డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసి విద్యార్థులకు అందిస్తారు. ప్రయోగ పరీక్ష 30 మార్కులకు ఉంటుంది. ఇందులో విద్యార్థికి 11 మార్కులు (35 శాతం) రావాలి. కేంద్రానికో సీఎస్‌ను ఇప్పటికే నియమించారు. జనరల్ పరీక్షలకు సబ్జెక్టు ఎగ్జామినర్లకు సీనియారిటీ ప్రాతిపదికన బోర్డు నుంచి నేరుగా ఉత్తర్వులు వస్తాయి. కేంద్రాల్లో ప్రతి విడతకు సీఎస్‌లు మారతారు. మూడు రోజులకొకసారి ఎగ్జామినర్లను మార్పు చేస్తారు.

కుమ్మరపల్లెలో విషాదం

● అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు ● కంటనీరు తెప్పించిన ఘటన

ములకలచెరువు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అభం...శుభం తెలియని చిన్నారుల మృతదేహాలను చూసి కుమ్మరపల్లె బోరుమంది. ములకలచెరువు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తండ్రి, ఇద్దరు పిల్లల అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. బి.కొత్తకోట మండలంలో వారి అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలంకు చెందిన సోమశేఖర్ కుటుంబం తొలుత బి.కొత్తకోట మండం బయప్పగారిపల్లె పంచాయతీ కుమ్మరపల్లెలో కొన్నేళ్ల పాటు నివాసముంది. తరువాత కూలీ పనుల కోసం మదనపల్లెకు వలస వెళ్ళింది. దీంతో అంత్యక్రియలను ఇక్కడ నిర్వహించారు. ములకలచెరువు షాదీమహల్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమశేఖర్, ఆయన ఐదేళ్ల కుమారుడు రెడ్డిశేఖర్, మూడేళ్ల కుమార్తె సిద్దేశ్వరిలు మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో సోమశేఖర్, మూడేళ్ళ చిన్నారి సిద్దేశ్వరి మృతదేహాలకు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. తిరుపతి రూయాలో చికిత్స పొందుతూ మృతి చెందిన రెడ్డిశేఖర్ మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి



సోమశేఖర్, చిన్నారులు రెడ్డిశేఖర్, సిద్దేశ్వరి (ఫైల్)

మదనపల్లెకు తీసుకొచ్చారు. మదనపల్లె నుంచి ముగ్గురు మృతదేహాలను బి.కొత్తకోట మండలం కుమ్మరపల్లెకు తరలించారు. బాలుడు, చిన్నారి మృతదేహాలను చూసిన కుమ్మరపల్లె కంటతడి పెట్టుకుంది. అయ్యో..పాపం చిన్నారులకు అప్పుడే నూరేళ్ళు నిండిపోయాయా అంటూ బంధువులు, గ్రామస్థులు బోరున విలపించారు. ముగ్గురి అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య బంధువులు పూర్తి చేశారు.

పాపం...కవిత

ఐచర్ వాహనం నిర్లక్ష్యం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మదనపల్లెకు చెందిన సోమశేఖర్, కుమారుడు రెడ్డిశేఖర్, కుమార్తె సిద్దేశ్వరిలు మృతి చెందడం, అలాగే సోమశేఖర్ భార్య కవిత కూడా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి రూయాలో చికిత్సలు పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇంత వరకు ఆమె స్పృహలోకి రాలేదు. భర్త సోమశేఖర్, కన్న బిడ్డలు రెడ్డిశేఖర్, సిద్దేశ్వరిలు మృతి చెందారన్న విషయం తెలియజేయడానికి వీలు లేకుండా పోయింది. దీంతో కవితకు భర్త, ఇద్దరు పిల్లల చివరి చూపు లేకుండా పోయింది. కవిత పరిస్థితిని చూసి బంధువులు కంటనీరు పెట్టుకుంటున్నారు. ఇలాంటి కష్టం పగవారికి కూడా రాకూడదని అంటున్నారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన సయ్యద్ ఖాదర్‌బాషా

కడప క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకు పరిధిలోని ప్రకాశ్ నగర్ మసీదు వెనక వైపు నివాసం ఉంటున్న సయ్యద్ ఖాదర్ బాషా (50) అనే వ్యక్తి ఈ నెల 6వతేదీ నుంచి కనబడడంలేదని అతని భార్య సయ్యద్ గౌసియా చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సయ్యద్‌ఖాదర్‌బాషాకు మతిస్థిమితంలేదని, తన భార్య ఇంట్లో లేని సమయంలో ఇంట్లో నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడని తెలిపారు. ఆ మేరకు అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా సయ్యద్‌ఖాదర్‌బాషా ఆచూకీ తెలిస్తే చిన్నచౌకు పోలీసుస్టేషన్ సీఐ సెల్ నెం.9121100520, ఎస్ఐ 9121100521, 9121100522 అనే నెంబర్లకు సమాచారం తెలపాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కురబలకోట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యకి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో వెలుగుచూసింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ములకలచెరువు మండలంలోని ముదివేడు పంచాయతీ పడమటి హరిజన వాడకు చెందిన క్రిష్ణప్ప(52) కూలి పనులు చేసుకుంటూ జీవనం జీవనం సాగిస్తున్నాడు. కాగా శనివారం రాత్రి ముదివేడుకు వచ్చి అక్కడ మద్యం తాగి ఇంటికి కూతవేటు దూరంలో పొలంలో పడిపోయాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టు పక్కల వెతికారు. ఉదయం గ్రామస్థులు కొందరు అతడిని చూసి పోలీసులకు సమాచారం అందించారు. కాగా అతడిపై గాయాలుండటంతో పలు కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. అతడిని ఎవరైన చంపారా? లేక కుక్కలు అతడిపై దాడి చేయడంతో మృతి చెందాడో? తెలియడం లేదు. కాగా మృతి చెందిన వ్యక్తికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్నకు వెండి లక్ష్మీ కాసుల హారం బహూకరణ

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామికి కోసువారిపల్లెకు చెందిన దాత వెండి లక్ష్మీ కాసుల హారం బహూకరించారు. కోసువారిపల్లె పంచాయతీ దిగువముత్రవారిపల్లెకు చెందిన బి.మల్లికార్జున రెడ్డి (శ్రీకృష్ణ చైతన్య నర్సింగ్ కాలేజి మదనపల్లె అధినేత) కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు రూ.3 లక్షల విలువ గల బంగారు తాపడం వేసిన 2.45 కిలోల వెండి లక్ష్మీ కాసుల హారాన్ని ఆదివారం ఆలయంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణమూర్తి, విజిలెన్స్ అధికారి బాలప్రసాదరెడ్డికి అందచేశారు. ఈ సందర్భంగా దాతకు టీటీడీ అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందచేశారు.



టీటీడీ అధికారులకు వెండి లక్ష్మీ కాసుల హారాన్ని అందచేస్తున్న దాత

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో లక్కినేని కిరణ్ (40) అనే వ్యక్తి ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడని పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోరుమామిళ్ల మండలంలోని ఈదుళ్లపల్లె గ్రామానికి చెందిన కిరణ్ ప్రస్తుతం పోరుమామిళ్లలోని కొత్తవీధిలో నివాసం ఉంటున్నాడని, 8వతేదీ రాత్రి 11గంటలకు మద్యం మత్తులో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడన్నారు. మృతుని భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలియని వారి వాహనం ఎక్కరాదు

● ఒకరి అరెస్టు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలియని వారి ద్విచక్ర వాహనాన్ని ఎవరూ ఎక్కరాదని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం సాయంత్రం జమ్మలమడుగు డీఎస్పీ కార్యాలయంలో ఎర్రగుంట్ల ప్రాంతంలో అరెస్టు అయిన నిందితుడిని వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆదివారం ఎర్రగుంట్ల మండలంలోని పరిసర ప్రాంతాల్లో దోపిడీలకు పాల్పడుతున్న బాలదాసరి యువరాజు అనే వ్యక్తిని పోట్లదుర్తి, ప్రొద్దుటూరు రోడ్డులో ఎర్రగుంట్ల సీఐతోపాటు సిబ్బంది అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా ప్రయాణం చేసేవారు తెలియని వారి వాహనాన్ని ఒకవేళ ఎక్కినా అందుకు సంబంధించిన వాహనం నంబరు తీసుకోవాలన్నారు. పట్టుబడిన బాలదాసరి యువరాజు మైదుకూరు పట్టణంలోని శాంతినగర్‌కు చెందినవాడు. నిందితుడు ఎర్రగుంట్ల ప్రాంతంలో పోట్లదుర్తి సమీపంలో ఓ వ్యక్తి కాలిన గాయాలకు మందు రాస్తుంటాడన్నారు. ఆయనతో మాయమాటలు చెప్పి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ నంబరు తీసుకుని వెళ్లిపోయి తర్వాత ఆ వ్యక్తికి ఫోన్ చేసి మందు రాయాలని తానే ద్విచక్ర వాహనంలో తీసుకెళుతానని చెప్పి ఆ వృద్ధుడిని తీసుకెళుతాడన్నారు. దారిలో నిర్మానుష్యమైన ప్రాంతానికి వెళ్లి బెదిరించి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, బంగారు రింగు లాక్కున్నాడన్నారు. ఈ వ్యక్తిని ఎర్రగుంట్ల పోలీసు టీం సీఐ నరేష్‌బాబు, ట్రైనీ డీఎస్పీ భవానీ, సిబ్బంది పట్టుకున్నారు.



పట్టుబడిన నిందితుడు, మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును
పునఃప్రారంభించాలి

● ఏఐటీయూసీ

కడప సెవెన్‌రోడ్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం కడప నగరంలోని చిలకలబావి వద్ద ఉన్న ఏఐటీయూసీ ఆఫీసులో నిర్వహించారు. ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ ఉద్దె మద్దిలేటి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చి దాదాపుగా ఏడు నెలలు గడిచిపోయినా చంద్రబాబు కూటమి ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రతినెలా మంత్రివర్గ సమావేశాలు నిర్వహిస్తున్నా రాష్ట్రంలో 50లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ ప్రయోజనాల కోసం ఒక నిర్ణయం కూడా తీసుకోకపోవడం దారుణమన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి దాదాపుగా 42 వేల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా ఉండాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు శివశంకర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 9, (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో మార్చి 4 నుంచి 9 వరకూ జరుగనున్న జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు పెండ్లిమర్రి మండలం గంగనపల్లి జిల్లా పరిషత్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొగ్గేటి శివశంకర్‌రెడ్డి ఎంపికయ్యారు. అనంతపురం పీటీసీ మైదానంలో ఈనెల 7 నుంచి 9 వరకూ జరిగిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో 45+ వయస్సు విభాగంలో హైజంప్,లాంగ్ జంప్ విభాగాల్లో శివశంకర్‌రెడ్డి రెండు బంగారు పతకాలు, ట్రిపుల్ జంప్ విభాగంలో వెండి పతకం సాధించినట్లు వెల్లడించారు. కాగా రోజూ విద్యార్థులతో పాటు తాను కూడా సాధన చేయడం వలన పతకాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఐదు పదుల వయసులో సైతం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించడం సులువే అన్నారు. ప్రధానంగా చక్కటి ప్రణాళిక, కఠిన శ్రమ, అంకితభావంతో ముందడుగు సాగితే విజయం సాధ్యమౌతుందన్నారు.



బంగారు పతకాలు సాధించిన శివశంకర్‌రెడ్డి

చికిత్స పొందుతూ యువకుడు మృతి

చిన్నమండెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న మండలంలోని దేవగుడిపల్లెకు చెందిన పి.సన్నీ (17) ఆదివారం మృతి చెందాడు. కడప-బెంగళూరు జాతీయ రహదారిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సన్నీని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



ప్రమాద స్థలంలో తీవ్రంగా గాయపడిన సన్ని

12 తులాల బంగారం స్వాధీనం

● నిందితుడి అరెస్టు

● 12 గంటలలోపు కేసును ఛేదించిన పోలీసులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున ఇంటి బయట పనిచేసుకుంటున్న ఓ మహిళను చంపుతానని బెదిరించి ఆమె వద్ద ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలతో ఓ వ్యక్తి పరారీ అయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు రెండు టీంలుగా ఏర్పడి, సీసీ కెమెరాల సహాయంతో పలు ప్రాంతాల్లో గాలించి, నేరం జరిగిన 12 గంటలలోపు నిందితున్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక టుటౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ భావన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులో నివాసం ఉంటున్న తుమ్మలపెంట సుబ్బయ్య భార్య ప్రభావతి ఆదివారం తెల్లవారుజామున 4.45 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద పనిచేసుకుంటుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి తలకు మంకీ క్యాపు, చేతులకు గ్లౌజులు ధరించి ఆమెను చంపుతానని బెదిరించి బంగారు తాళిబొట్టు సరడు, నాలుగు బంగారు గాజులను అపహరించి ద్విచక్ర వాహనంలో పరారీ అయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక టుటౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఉదయం కేసు నమోదు అయింది. సంఘటన అనంతరం డీఎస్పీ ఆధ్వర్యంలో టుటౌన్ సీఐ ఎం. యుగంధర్, ఎస్ఐలు జే. ధనుంజయుడు, ఆర్. రాఘవేంద్రారెడ్డి రెండు గ్రూపులుగా ఏర్పడి నిందితుని కోసం పలు కోణాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలో అమర్చిన సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితులను ప్రశ్నించి వివరాలు సేకరించారు. సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో టుటౌన్ బైపాస్ రోడ్డులోని మానస రెస్టారెంట్ పక్కనగల మారుతీ అపార్టుమెంట్‌కు వెళ్లే దారిలో స్థానిక ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన ఉచ్చుగారి రసూల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇతని వద్ద ప్రభావతి నుంచి అపహరించిన మొత్తం 12 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని బజాజ్ డిస్కవరీ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.10 లక్షలు అవుతుందని వివరించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భావన, స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు



● కక్ష సాధింపుకోసమే నేరం

బాధితురాలు ప్రభావతి భర్త సుబ్బయ్య స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఇతని వద్ద నిందితుడు రసూల్ రెండు సంవత్సరాలుగా గుమస్తాగా పనిచేస్తున్నాడు. రసూల్ తన ముక్కుకు ఆపరేషన్ చేయించుకునేందుకు జనవరి 1వ తేదీ నుంచి గుమస్తా పనికి రాలేదు. డిసెంబరు నెల జీతంతో పాటు ఆపరేషన్‌కోసం అదనంగా రూ.10 వేలు ఇవ్వమని యజమానిని అడిగాడు. దీంతో యజమాని సుబ్బయ్య ఆపరేషన్ చేయించుకుని రాపో తర్వాత ఇస్తానని చెప్పగా.. శస్త్ర చికిత్స చేయించుకున్న తర్వాత రసూల్ తనకు రావాల్సిన జీతం అడిగాడు. దీంతో యజమాని తర్వాత ఇస్తాననంటూ వాయిదాలు వేస్తూ వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎలాగైనా సుబ్బయ్యను ఇబ్బంది పెట్టాలని నిర్ణయించుకుని ఆదివారం తెల్లవారుజామున సుబ్బయ్య తన కిరాణా షాపు వద్ద ఉండగా చూసి ఎవరూ గుర్తు పట్టకుండా మంకీ క్యాంపు, చేతులకు గ్లౌజులు ధరించి ఆయన ఇంటి వద్దకు వెళ్లి అతని భార్య ప్రభావతిని బెదిరించి బంగారు ఆభరణాలను అపహరించినట్లు డీఎస్పీ వివరించారు. నేరం జరిగిన 12 గంటలలోపు నిందితున్ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి అపహరించిన సొత్తును స్వాధీనం చేసుకుని కేసును ఛేదించిన సంఘటనలో టుటౌన్ సీఐ ఎం.యుగంధర్, ఎస్ఐలు ధనుంజయుడు, రాఘవేంద్రారెడ్డి, కానిస్టేబుళ్లు ఎం. రవీంద్రనాయక్, బి.మహబూబ్‌బాష, వి.బాబాఫకృద్దీన్‌ను డీఎస్పీ అభినందించారు.

గంగమ్మ జాతర ఏర్పాట్లు పూర్తి చేయండి

లక్కిరెడ్డిపల్లె,ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురంలో ఈ నెల 28, మార్చి ఒకటో తేదీల్లో నిర్వహించనున్న గంగమ్మజాతరకు ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని రోడ్డు రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాదురెడ్డి సూచించినట్లు ఈవో శ్రీనివాసులు తెలిపారు .ఆదివారం జాతర ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేశారు. లక్కిరెడ్డిపల్లె గంగమ్మజాతరకు సుమారు 2లక్షల మంది భక్తులు వస్తారని , వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని మంత్రి సూచించారన్నారు. జాతర ప్రాంగణమంతా శుభ్రం చేయించాలని, రామాపురం, చిట్లూరు క్రాస్‌నుంచి, మర్రి చెట్టునుంచి జాతర ప్రాంతానికి ఉచిత బస్సు నడుపనున్నట్లు వివరించారు. కాగా, ఆదివారం గంగమ్మకు ఘనంగా పూజలు నిర్వహించారు.

రాజంపేట యువతికి డాక్టరేట్


పావని

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటకు చెందిన మర్రిపల్లి పావనికి యోగి వేమన యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాజంపేట పట్టణానికి చెందిన మర్రిపల్లి గంగయ్య ఆచారి, సిద్దమ్మ కూతురు పావని డాక్టర్ ఏ. అశోక్‌కుమార్ పర్యవేక్షణలో భౌతికశాస్త్రంపై పరిశోధన చేశారు.

నాగారపమ్మకు పూజలు

సుండుపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈడిగపల్లి సమీపంలోని నాగారపమ్మ ఆలయంలో ఆదివారం పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. ఆలయ సమీపంలో అన్నదానం చేశు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నందలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీకి మన్నెం ఈశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని టీడీపీ అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం తెలిపారు. అనారోగ్యం కారణంగా మృతి చెందిన మన్నెం ఈశ్వరయ్య కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు కృషి చేస్తానని గ్రామస్థులు వారి కుటుంబానికి అండగా ఉండాలని కోరారు.

ముగిసిన ఎస్‌ఏఎల్‌సీ స్త్రీల మహా సమాజం

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోని నాయుడుపేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌ఏఎల్‌సీ 82వ మహా సమాజంలో ఆదివారం రైల్వేకోడూరు ఎస్‌ఏఎల్‌సీ చర్చికి చెందిన 20 మంది మహిళలు పాల్గొనిన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు మేరి గ్లోరియా, శ్రీమతి శాంతమ్మ థామస్, పాస్టర్ అమ్మటి మంజుల, పాలెం మేరి, రాణి సంయుక్త, కళ్యాణి, సుకేశిని, పి.జ్యోతి, వినోలియా తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన నెమలికి చికిత్స

గుర్రంకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణం తూముకుంట రోడ్డు మార్గంలోని ఓ రైతు పొలంలో గాయపడిన నెమలికి ఆదివారం పశువైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. రైతు వివరాల మేరకు తూముకుంట రోడ్డుకు చెందిన ఓ రైతు పొలంలో ఆదివారం ఓ నెమలి కాళ్లకు గాయాలై ఎగురలేక, నడవలేని స్థితిలో ఉండడం గమనించి అటవీశాఖ అధికారులకు తెలిపారు. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు నెమలి పరిస్థితిని గమనించి పశువైద్య సిబ్బందికి తెలపడంతో ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం నెమలిని అటవీలో వదిలారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు రామ్‌మోహన్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి భరోసా.

- అంగన్‌వాడీల్లో వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం దృష్టి
- 80 శాతం పూర్తయిన మరుగుదొడ్లు, నీటి వసతి ఏర్పాట్లు




బైరవగుట్ట అంగన్వాడీ కేంద్రం (ఇన్‌సర్ట్)అంగన్‌వాడీ కేంద్రంపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు

సుండుపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు సంరక్షణకు కృషి చేసే అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. తగినన్ని నిధులు విడుదల చేయడంతో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ అంగన్వాడీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడంతో ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడింది.

సుండుపల్లి మండలంలో శాశ్వత భవనాలు కల్గిన 22 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ఒక్కో దానికి రూ. 36 వేలు చొప్పున నిధులు విడుదల చేసింది. భైరవగుట్ట, సొంటంవారిపల్లి, చప్పిడివాండ్లపల్లి, భాగంపల్లి, కమ్మపల్లి, వడ్డిపల్లి, సామిసేనిగడ్డ, యానాది కాలనీ, ఊరమాదిగపల్లి, చంద్రాజుగారిపల్లి, ఎరుకలబిడారు. మిట్టబిడికి, ముడుంపాడు, పెద్దబిడికి, యానాది కాలనీ-2, చెరుకువాండ్లపల్లి, గుల్లావాండ్లపల్లి, కొరివివాండ్లపల్లి, రాయవారం, బంగ్లాహరిజనవాడ, ముడుంపాడుక్రాస్, నల్లగుట్టపల్లెలోని అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం దాదాపు పూర్తికానున్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. పూర్తికాని వాటిని త్వరగా పూర్తి చేస్తామన్నారు.

మండలంలోని భైరవగుట్ట, సొంటంవారిపల్లి, చప్పిడివాండ్లపల్లి, భాగంపల్లి, సామిసేనిగడ్డ, ఊరమాదిగపల్లి, ఎరుకలబిడారు. ముడుంపాడు, మిట్టబిడికి, రాయవారం, బంగ్లాహరిజనవాడ, ముడుంపాడుక్రాస్, నల్లగుట్టపల్లెలోని కేంద్రాల్లో తాగునీటి వసతి కల్పనకు ఒక్కో దానికి రూ. 17 వేలు చొప్పున ప్రభుత్వం కేటాయించగా, ఒకటి రెండు మినహా దాదాపు అన్ని కేంద్రాల్లో పనులు పూర్తయ్యాయంటున్నారు.

వసతులు కల్పించడం సంతోషం



అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభించడం సంతోషదాయకం. పలు కేంద్రాల్లో ఫ్యాన్లు, కిటికీలు సరిగ్గా లేవు. మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఆయా సమస్యలపై ప్రభుత్వం శ్రద్ధ వహించాలి.

\- సుజాత, ఏఐటీయూసీ నాయకురాలు, సుండుపల్లి

త్వరగా పూర్తి చేస్తాం..



మరుగుదొడ్లు, నీటి వసతి పనులు 80 శాతం పూర్తయ్యాయి. పూర్తి చేసిన పనులకు బిల్లులు కూడా మంజూరవుతున్నాయి. గడువులోపు అన్నీ పూర్తి చేస్తాము. ఇంకా ఎక్కడైనా సమస్యలున్నట్లు చెబితే పై అదికారుల దృష్టికి తీసుకెళతాం.

\- ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ

'నులిపురుగుల నిర్మూలన' విజయవంతం చేయాలి

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా॥శైలజ పిలుపునిచ్చారు. రాయచోటిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా 1-19 ఏళ్ల మధ్య వయసున్న 4,06,121 మంది పిల్లలకు ఆల్బెండజోల్-400 మాత్రలు వేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం అనంతరం ఈ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. సోమవారం మాత్రలు తీసుకోని వారికి 17వ తేదీన అందిస్తామన్నారు. అంతకుమునుపు ఆమె జిల్లాలోని వైద్య ఆరోగ్య, స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ, పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, జువైనల్ శాఖలతో సమావేశమయ్యారు.

గంపల వాసుదేవకు స్వర్ణ నంది పురస్కారం

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తాను రచించిన పల్లెఘోష అనే పుస్తకానికి స్వర్ణ నంది పురస్కారం లభించినట్లు మండలంలోని మారావారిపల్లెకు చెందిన గంపల వాసుదేవ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో ఆదివారం తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవ సంస్థ చైర్మన్ యు.వి. రత్నం ఈ పురస్కారం అందించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రైల్వే కోడూరు: అబాకస్ పోటీలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



రాజంపేట: విద్యార్థినిని అభినందిస్తున్న యాజమాన్యం

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విజయవాడలో మన కళ్యాణ వేదికలో విశ్వం ఎడ్యుటెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో రైల్వేకోడూరు విద్యార్థులు మూడవ స్థానంలో నిలిచారు. పట్టణంలోని కాకతీయ పాఠశాల రెండో తరగతి విద్యార్థిని ఎం.ఆర్.జశ్విక్, నాలుగో తరగతి విద్యార్థినులు జె.మహన్య, ఎన్.సిరి, ఐదో తరగతి విద్యార్థి ఆర్.యశోనందన్ రాజు మూడవ స్థానం సాధించారని పాఠశాల డైరెక్టర్లు వై. జయప్రకాష్, ఎం.శ్రీను, ఎస్.కుమార్ రాజు, ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. ఆయా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

రాజంపేట టౌన్: అబాకస్ పోటీల్లో రాజంపేటకు చెందిన తిరుమలశెట్టి హరిణి తృతీయ స్థానంలో నిలిచింది. పట్టణంలో కేంబ్రిడ్జి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న హరిణి విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో మూడో ర్యాంకు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం ప్రకటించింది.

గంగనపల్లి వెంకటరమణకు సత్కారం


సత్కారం అందుకుంటున్న గంగనపల్లి వెంకటరమణ

నందలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు పండితుడు, కవి గంగనపల్లి వెంకటరమణ ఆదివారం కడపలో ఘనసన్మానం అందుకున్నారు. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం, రాయలసీమ భాగస్వామ్యం అనే పేరుతో వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాహిత్య సాంస్కృతిక మహాసభల్లో మన రాయలసీమ చరిత అనే శీర్షికతో రచించిన పద్య కవితలను వినిపించారు. దీంతో కార్యక్రమ నిర్వాహకులు ఆయనను శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు ఆయనను అభినందించారు.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా 14 నుంచి ఆందోళన


మీడియాతో మాట్లాడుతున్న వామపక్ష నేతలు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లోని ప్రజావ్యతిరేక ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం రాయచోటిలో వారు విలేఖరులతో మాట్లాడుతూ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా రాయచోటిలో ధర్నాలు, నిరసనలు, ప్రదర్శనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పూర్తిగా విస్మరించిం దని, ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై కేటాయింపులు గత ఏడాది కంటే గణనీయంగా తగ్గించేసిందన్నారు. జీఎస్టీ, ధరల పెరుగుదలతో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మిక వర్గాన్ని మోదీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రజావ్యతిరేక బడ్జెట్‌పై ప్రత్యా మ్నాయ ప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వామపక్ష పార్టీలు నిర్ణయించా యని వివరించారు. అందులో భాగంగా తాము చేపట్టబోయే ఆందోళన కార్యమాలను జయప్రదం చేయాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు.

'సీపీఆర్ మంగళ' అపార్ట్‌మెంట్ ప్రీ బుకింగ్ ప్రారంభం


సీపీఆర్ అపార్ట్‌మెంట్ ప్రీ బుకింగ్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్లు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మంగళం పరిధిలో అధునాతనంగా నిర్మించిన 'సీపీఆర్ మంగళ' 2బీకే అపార్టుమెంట్ ప్రీ బుకింగ్‌ను ఎండీ కేవీ చలపతి ఆదివారం ప్రారంభించారు. కరకంబాడి రోడ్డులోని ఎంఆర్ఎఫ్ షోరూం ఎదురుగా సీపీఆర్ అపార్టుమెంట్ ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తోందన్నారు. ప్రీమియం లోకేషన్, మోడర్న్ డిజైన్, ఆర్కిటెక్చర్, సెక్యూరిటీ, సేఫ్టీ, పార్కింగ్, క్లబ్‌హౌస్, పార్కు, పాఠశాలలు, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్‌కు అత్యంత సమీపంలో ఉందని వివరించారు. ఆరంభ ధర రూ.37లక్షలుగా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు 9492013322/66/88 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ ప్రారంభోత్సవంలో డైరెక్టర్లు కాశీ, లోకేష్, వినోద్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ గుప్త



రాజంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష స్థానానికి ఆదివారం హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో గ్రంధే సత్యనారాయణ గుప్త తన సమీప ప్రత్యర్థి ప్రకాశ్‌రావుపై 18 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రకాశ్‌రావుకు 195 ఓట్లు రాగా సత్యనారాయణ గుప్తకు 213 ఓట్లు, అన్నం సుబ్బరాయుడుకు 27 ఓట్లు వచ్చాయి. దీంతో సత్యనారాయణ వర్గీయులు అమ్మవారి శాల ఎదుట పెద్దఎత్తున బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. అభిమానులు, శ్రేయోభిలాషులు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు

శివాలయంలో హోమం

రామాపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రామాపురం మండలంలోని కడవకూటివాండ్లపల్లెలో బండపై వెలసిన మరకత లింగ శివుడి ఆలయంలో ఆదివారం హోమంనిర్వహించారు. విగ్రహదాతలు రాధాకృష్ణ, విజయలక్ష్మి, శివశంకర్, ఇందారా, జనార్దన్, బాబు, లత, శ్రీనివాసులు, లక్ష్మికళ తదితరులు పూజలు చేశారు. హసనాపురానికి చెందిన బసవ సుబ్బయ్య కుటుంబీకులు అన్నదానం చేశారు.

బస్సు, లారీ ఢీ : ముగ్గురికి గాయాలు

సిద్దవటం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుమలోపల్లె కామాక్షిగుడి సమీపంలో. ఆదివారం సాయంత్రం కడప నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సును తిరుపతి నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో బస్సు డ్రైవర్ డీవీడీ రెడ్డి, మరో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్, 108 సిబ్బంది వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ శివప్రసాద్ సందర్శించారు.

వీహెచ్‌పీ కార్యవర్గం ఎన్నిక


ఆలయ ఈవోతో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్‌నాయకులు

గాలివీడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలవిశ్వహిందూ పరిషత్ సంస్థ కార్యవర్గాన్ని అన్నమయ్య వీహెచ్‌పీ సహాయకార్యదర్శి వైఎస్ జయసింహ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల వీహెచ్‌పీ అధ్యక్షుడుగా బుక్కపట్నం హరి, ఉపాధ్యక్షుడిగా ఇరగంరెడ్డి, కార్యదర్శిగా నాగభూషణం, కోశాధికారిగా పెంచలయ్య, గోరక్షక్‌గా శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా బాలయోగి, భజరంగదళ్ సభ్యులుగా భాస్కర్, కిరణ్‌కుమార్, జగన్మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సనాతన హైందవ పరంపరను విస్తరించడంతోపాటు, ప్రతి హిందువును సంఘటితంచేసి ధర్మరక్షణకు బద్ధులను చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ధర్మచరణ్ సంపర్క్ ప్రముఖ్ మణికంఠ, జిల్లా ధర్మ ప్రచార ప్రముఖ్ నాగరాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో వలంటీర్లను నియమిస్తాం

గంగమ్మజాతర సందర్భంగా వలంటీర్లను నియమించనున్నట్లు వీహెచ్‌పీ, భజరంగదళ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తెలిపారు. ఆదివారం గంగమ్మ ఆలయ కార్యనిర్వహణ అధికారితో వారు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కొండూరు వెంకటరామరాజు, వీరారెడ్డి, సహదేవరెడ్డి, అయోధ్యపురం లక్ష్మిరెడ్డి, లక్ష్మిదేవి, వేణుగోపాల్, విశ్వహిందూ మండల ప్రెసిడెంట్ యనమల విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు

రోడ్డు పనులకు చమర్తి శంకుస్థాపన


సిమెంటు రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకారంపల్లె, మన్నూరు ఈద్గా వద్ద సిమెంటు రోడ్ల పనులకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, రాజంపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, రూరల్ అధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు, ప్రధాన కార్యదర్శి అబూబకర్, కౌన్సిలర్ మిరియాల చెంగమ్మ, జిల్లా కమ్మసంఘం అధ్యక్షుడు శివ నారాయణ చౌదరి, మహిళా పార్లమెంట్ అధ్యక్షురాలు అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

గురువులపై ఆప్యాయత మరువలేనిది

- విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సిద్దవటం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం 1987 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ గురువులపై వారు చూపుతున్న ఆప్యాయత తాము మరువలేమని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ ఈ కార్యక్రమం కోసం మూడు రోజులుగా చేసిన శ్రమ ఫలించిందని, అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడంతోపాటు, పాఠశాలకు సింటెక్స్ ట్యాంక్ బహుమతిగా అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ఎలక్ట్రీషియన్ ఉపాధ్యాయుడు సిద్దారెడ్డి, గురువు రెడ్డి, పాల్గొన్నారు.

కోదండ రామాలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

సిద్దవటం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లె, కడపాయపల్లె గ్రామాలకు చెందిన కోదండరామాలయం ప్రారంభోత్సవంపై ఆదివారం దేవదాయశాఖ అధికారులు గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో ఆలయ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని గ్రామ పెద్దలు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్, కడప డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శివయ్య, రాజంపేట డివిజనల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, పోలీసులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

150 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక


కంటి వైద్యశిబిరానికి తరలివచ్చిన ప్రజలు

పుల్లంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేటలోని ఎస్‌బీవీడీ సభ ఉన్నత పాఠశాలలో ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 800 మందికి పైగా పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో నలుగురు కంటి వైద్యులతో పాటు 30 మంది సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, కూటమి నాయకులు పర్యవేక్షించారు. 250 మందికి కంటి అద్దాలు, 150 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. ఆపరేషన్ అవసరమైన వారిని బస్సులో తిరుపతికి తరలించారు.జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నేలపాటి రామచంద్రనాయుడు, మండల టీడీపీ ఇన్‌చార్జి సుధాకర్‌నాయుడు, కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, ముద్దా సుభాష్‌రెడ్డి, అనుమల గుండం చంద్ర, జనసేన మండల ఇన్‌ఛార్జి ప్రసాద్, కూటమి నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌నాయుడు, సింగం ఆదినారాయణరెడ్డి, పసుపులేటి సుబ్బయ్య, కొత్తపల్లె రమణ, చిన్నం శివయ్య తదితరులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు


రక్తదానం చేస్తున్న యువత

నందలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆల్ హది వెల్ఫేర్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కువైట్ ప్రవాస నందలూరు యూత్ సహకారంతో స్థానిక బస్టాండ్‌లో ఆదివారం నిర్వహించిన వైద్య, రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించినట్లు ఆ సంస్థ చైర్మన్ మహ్మద్‌ఇబ్రహీం, అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్ నజీర్, జిల్లా సలహాదారు షేక్ కరీముల్లా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య శిబిరంలో 250 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. ఈ శిబిరంలో దాదాపు 55 మంది రక్తదానం చేశారన్నారు. కడపకు చెందిన కీళ్ల వైద్యుడు డాక్టర్ జహంగీర్, కంటి వైద్యుడు డాక్టర్ అసిఫ్, చిన్నపిల్లల స్పెషలిస్టు సయ్యద్ ఫరూక్ హుస్సేన్, మధుమేహ నిపుణుడు డాక్టర్ జయభాస్కర్‌రావు, గైనకాలజిస్టు మస్తానమ్మ పరీక్షలు నిర్వహించారు. నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, కాలేశా, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో అగ్రగామిగా భారత్


విజయోత్సవ సభలో మాట్లాడుతున్న నాగోతు రమేష్‌నాయుడు

నందలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా మారిపోతుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు అన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయదుందుభి మోగించిన సందర్భంగా అరవపల్లెలోని ఆర్ అండ్ బీ అతిథిగృహ సమీపంలో ఆదివారం విజయోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు షబ్బీర్ అహ్మద్, పోతురాజు మస్తానయ్య, హిమగిరినాథ్ యాదవ్, జయచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు ఆర్ముగం, విశ్వనాథ్, చామంచి పెంచలయ్య, మోడపోతుల రాము, మౌలా, మెహర్, జనసేనపార్టీ నాయకులు గురివిగారి వాసు, కొట్టే శ్రీహరి, ఆకుల చలపతి పాల్గొన్నారు.

నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

● కేంద్రాలు 78, విద్యార్థులు 14,508

● ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల పర్యవేక్షణలో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇవన్నీ నేరుగా జిల్లా, రాష్ట్ర కార్యాలయాలకు అనుసంధానమై ఉంటాయని, ఉన్నత స్థాయిలో నిర్వహణను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 10వ తేది నుంచి జనరల్ కోర్సులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభమవుతాయి. 19వ తేదీ వరకు షెడ్యూల్ ఉంది. నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. కాగా జనరల్ 78 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. 14508 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

సొంత కళాశాలల్లోనే..

ఇంటర్ ప్రయోగ పరీక్షల్లో జంబ్లింగ్ విధానం అమలులో లేదు. మూడేళ్ల క్రితమే తొలగించారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలల్లోనే పరీక్షలు రాస్తారు. తక్కువ విద్యార్థులున్న కళాశాలలను సమీపంలోని వాటితో కలిపి నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్ఐఓ కన్వీనరుగా డీఈసీ కమిటీ, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో పాటు ప్రత్యేకాధికారిగా జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పర్యవేక్షించనున్నారన్నారు.

గంట ముందుగా ప్రశ్నపత్రం

ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రం ఆధారంగా పరీక్షలు నిర్వహిస్తారు. సంబంధిత పరీక్ష కేంద్రం ముఖ్య పర్యవేక్షణాధికారికి గంట ముందుగా ప్రశ్నాపత్రం బోర్డు నుంచి వస్తుంది. డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసి విద్యార్థులకు అందిస్తారు. ప్రయోగ పరీక్ష 30 మార్కులకు ఉంటుంది. ఇందులో విద్యార్థికి 11 మార్కులు (35 శాతం) రావాలి. కేంద్రానికో సీఎస్‌ను ఇప్పటికే నియమించారు. జనరల్ పరీక్షలకు సబ్జెక్టు ఎగ్జామినర్లకు సీనియారిటీ ప్రాతిపదికన బోర్డు నుంచి నేరుగా ఉత్తర్వులు వస్తాయి. కేంద్రాల్లో ప్రతి విడతకు సీఎస్‌లు మారతారు. మూడు రోజులకొకసారి ఎగ్జామినర్లను మార్పు చేస్తారు.

కుమ్మరపల్లెలో విషాదం

● అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు ● కంటనీరు తెప్పించిన ఘటన

ములకలచెరువు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అభం...శుభం తెలియని చిన్నారుల మృతదేహాలను చూసి కుమ్మరపల్లె బోరుమంది. ములకలచెరువు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తండ్రి, ఇద్దరు పిల్లల అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. బి.కొత్తకోట మండలంలో వారి అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలంకు చెందిన సోమశేఖర్ కుటుంబం తొలుత బి.కొత్తకోట మండం బయప్పగారిపల్లె పంచాయతీ కుమ్మరపల్లెలో కొన్నేళ్ల పాటు నివాసముంది. తరువాత కూలీ పనుల కోసం మదనపల్లెకు వలస వెళ్ళింది. దీంతో అంత్యక్రియలను ఇక్కడ నిర్వహించారు. ములకలచెరువు షాదీమహల్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమశేఖర్, ఆయన ఐదేళ్ల కుమారుడు రెడ్డిశేఖర్, మూడేళ్ల కుమార్తె సిద్దేశ్వరిలు మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో సోమశేఖర్, మూడేళ్ళ చిన్నారి సిద్దేశ్వరి మృతదేహాలకు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందిన రెడ్డిశేఖర్ మృతదేమానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మదనపల్లెకు తీసుకొచ్చారు. మదనపల్లె నుంచి ముగ్గురు మృతదేహాలను బి.కొత్తకోట మండలం కుమ్మరపల్లెకు తరలించారు. బాలుడు, చిన్నారి మృతదేహాలను చూసిన కుమ్మరపల్లె కంటతడి పెట్టుకుంది. అయ్యో..పాపం చిన్నారులకు అప్పుడే నూరేళ్ళు నిండిపోయాయా అంటూ బంధువులు, గ్రామస్తులు బోరున విలపించారు. ముగ్గురి అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య బంధువులు పూర్తి చేశారు.



సోమశేఖర్, చినారులు రెడ్డిశేఖర్, సిద్దేశ్వరి (ఫైల్)

పాపం...కవిత

ఐచర్ వాహనం నిర్లక్ష్యం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మదనపల్లెకు చెందిన సోమశేఖర్, కుమారుడు రెడ్డిశేఖర్, కుమార్తె సిద్దేశ్వరిలు మృతి చెందడం, అలాగే సోమశేఖర్ భార్య కవిత కూడా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి రుయాలో చికిత్సలు పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇంత వరకు ఆమె స్పృహలోకి రాలేదు. భర్త సోమశేఖర్, కన్న బిడ్డలు రెడ్డిశేఖర్, సిద్దేశ్వరిలు మృతి చెందారన్న విషయం తెలియజేయడానికి వీలు లేకుండా పోయింది. దీంతో కవితకు భర్త, ఇద్దరు పిల్లల చివరి చూపు లేకుండా పోయింది. కవిత పరిస్థితిని చూసి బంధువులు కంటనీరు పెట్టుకుంటున్నారు. ఇలాంటి కష్టం పగవారికి కూడా రాకూడదని అంటున్నారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన సయ్యద్ ఖాదర్‌బాషా

కడప క్రైం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్న చౌకు పరిధిలోని ప్రకాశ్ నగర్ మసీదు వెనక వైపు నివాసం ఉంటున్న సయ్యద్ ఖాదర్ బాషా (50) అనే వ్యక్తి ఈ నెల 6వతేదీ నుంచి కనబడడంలేదని అతని భార్య సయ్యద్ గౌసియా చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సయ్యద్‌ఖాదర్‌బాషాకు మతిస్థిమితంలేదని, తన భార్య ఇంట్లో లేని సమయంలో ఇంట్లో నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడని తెలిపారు. ఆ మేరకు అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా సయ్యద్‌ఖాదర్‌బాషా ఆచూకీ తెలిస్తే చిన్నచౌకు పోలీసుస్టేషన్ సీఐ సెల్ నెం.9121100520, ఎస్ఐ 9121100521, 9121100522 అనే నెంబర్లకు సమాచారం తెలపాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కురబలకోట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యకి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో వెలుగుచూసింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ములకలచెరువు మండలంలోని ముదివేడు పంచాయతీ పడమటి హరిజన వాడకు చెందిన క్రిష్ణప్ప(52) కూలి పనులు చేసుకుంటూ జీవనం జీవనం సాగిస్తున్నాడు. కాగా శనివారం రాత్రి ముదివేడుకు వచ్చి అక్కడ మద్యం తాగి ఇంటికి కూతవేటు దూరంలో పొలంలో పడిపోయాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టు పక్కల వెతికారు. ఉదయం గ్రామస్థులు కొందరు అతడిని చూసి పోలీసులకు సమాచారం అందించారు. కాగా అతడిపై గాయాలుండటంతో పలు కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. అతడిని ఎవరైన చంపారా? లేక కుక్కలు అతడిపై దాడి చేయడంతో మృతి చెందాడో? తెలియడం లేదు. కాగా మృతి చెందిన వ్యక్తికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్నకు వెండి లక్ష్మీ కాసుల హారం బహూకరణ

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామికి కోసువారిపల్లెకు చెందిన దాత వెండి లక్ష్మీ కాసుల హారం బహూకరించారు. కోసువారి పల్లె పంచాయతీ దిగువముత్రవారిపల్లెకు చెందిన బి.మల్లికార్జున రెడ్డి (శ్రీకృష్ణ చైతన్య నర్సింగ్ కాలేజి మదనపల్లె అధినేత) కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు రూ.3 లక్షల విలువ గల బంగారు తాపడం వేసిన 2.45 కిలోల వెండి లక్ష్మీ కాసుల హారాన్ని ఆదివారం ఆలయంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణమూర్తి, విజిలెన్స్ అధికారి బాలప్రసాదరెడ్డికి అందచేశారు. ఈ సందర్భంగా దాతకు టీటీడీ అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందచేశారు.



టీటీడీ అధికారులకు వెండి లక్ష్మీ కాసుల హారాన్ని అందచేస్తున్న దాత

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో లక్కినేని కిరణ్ (40) అనే వ్యక్తి ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడని పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోరుమామిళ్ల మండలంలోని ఈదుళ్లపల్లె గ్రామానికి చెందిన కిరణ్ ప్రస్తుతం పోరుమామిళ్లలోని కొత్తవీధిలో నివాసం ఉంటున్నాడని, 8వతేదీ రాత్రి 11గంటలకు మద్యం మత్తులో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడన్నారు. మృతుని భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ముగిసిన ఉరుసు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హసన్‌ఖాన్‌వీధిలో వెలసిన హజరత్ ఖ్వాజాపీర్ మస్తాన్‌వలి దర్గాలో మూడురోజుల పాటు ఉరుసు మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. చివరి రోజు ఆదివారం దర్గాలో తహలీల్ ఫాతెహాను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలకు కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి ముఖ్య అతిథిగా హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు.

తెలియని వారి వాహనం ఎక్కరాదు

● ఒకరి అరెస్టు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలియని వారి ద్విచక్ర వాహనాన్ని ఎవరూ ఎక్కరాదని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం సాయంత్రం జమ్మలమడుగు డీఎస్పీ కార్యాలయంలో ఎర్రగుంట్ల ప్రాంతంలో అరెస్టు అయిన నిందితుడిని వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆదివారం ఎర్రగుంట్ల మండలంలోని పరిసర ప్రాంతాల్లో దోపిడీలకు పాల్పడుతున్న బాలదాసరి యువరాజు అనే వ్యక్తిని పోట్లదుర్తి, ప్రొద్దుటూరు రోడ్డులో ఎర్రగుంట్ల సీఐతోపాటు సిబ్బంది అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా ప్రయాణం చేసేవారు తెలియని వారి వాహనాన్ని ఒకవేళ ఎక్కినా అందుకు సంబంధించిన వాహనం నంబరు తీసుకోవాలన్నారు. పట్టుబడిన బాలదాసరి యువరాజు మైదుకూరు పట్టణంలోని శాంతినగర్‌కు చెందినవాడు. నిందితుడు ఎర్రగుంట్ల ప్రాంతంలో పోట్లదుర్తి సమీపంలో ఓ వ్యక్తి కాలిన గాయాలకు మందు రాస్తుంటాడన్నారు. ఆయనతో మాయమాటలు చెప్పి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ నంబరు తీసుకుని వెళ్లిపోయి తర్వాత ఆ వ్యక్తికి ఫోన్ చేసి మందు రాయాలని తానే ద్విచక్ర వాహనంలో తీసుకెళుతానని చెప్పి ఆ వృద్ధుడిని తీసుకెళుతాడన్నారు. దారిలో నిర్మానుష్యమైన ప్రాంతానికి వెళ్లి బెదిరించి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, బంగారు రింగు లాక్కున్నాడన్నారు. ఈ వ్యక్తిని ఎర్రగుంట్ల పోలీసు టీం సీఐ నరేష్‌బాబు, ట్రైనీ డీఎస్పీ భవానీ, సిబ్బంది పట్టుకున్నారు.



పట్టుబడిన నిందితుడు, మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును

పునఃప్రారంభించాలి

● ఏఐటీయూసీ

కడప సెవెన్‌రోడ్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం కడప నగరంలోని చిలకలబావి వద్ద ఉన్న ఏఐటీయూసీ ఆఫీసులో నిర్వహించారు. ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ ఉద్దె మద్దిలేటి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును పునఃప్రారంబిస్తామని హామీ ఇచ్చి దాదాపుగా ఏడు నెలలు గడిచిపోయినా చంద్రబాబు కూటమి ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రతినెలా మంత్రివర్గ సమావేశాలు నిర్వహిస్తున్నా రాష్ట్రంలో 50లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ ప్రయోజనాల కోసం ఒక నిర్ణయం కూడా తీసుకోకపోవడం దారుణమన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి దాదాపుగా 42 వేల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా ఉండాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు శివశంకర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 9, (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో మార్చి 4 నుంచి 9 వరకూ జరుగనున్న జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు పెండ్లిమర్రి మండలం గంగనపల్లి జిల్లా పరిషత్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొగ్గేటి శివశంకర్‌రెడ్డి ఎంపికయ్యారు. అనంతపురం పీటీసీ మైదానంలో ఈనెల 7 నుంచి 9 వరకూ జరిగిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో 45+ వయస్సు విభాగంలో హైజంప్,లాంగ్ జంప్ విభాగాల్లో శివశంకర్‌రెడ్డి రెండు బంగారు పతకాలు, ట్రిపుల్ జంప్ విభాగంలో వెండి పతకం సాధించినట్లు వెల్లడించారు. కాగా రోజూ విద్యార్థులతో పాటు తాను కూడా సాధన చేయడం వలన పతకాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఐదు పదుల వయసులో సైతం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించడం సులువే అన్నారు. ప్రధానంగా చక్కటి ప్రణాళిక, కఠిన శ్రమ, అంకితభావంతో ముందడుగు సాగితే విజయం సాధ్యమౌతుందన్నారు.



బంగారు పతకాలు సాధించిన శివశంకర్‌రెడ్డి

చికిత్స పొందుతూ యువకుడు మృతి

చిన్నమండెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న మండలంలోని దేవగుడిపల్లెకు చెందిన పి.సన్నీ (17) ఆదివారం మృతి చెందాడు. కడప-బెంగళూరు జాతీయ రహదారిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సన్నీని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



ప్రమాద స్థలంలో తీవ్రంగా గాయపడిన సన్నీ

12 తులాల బంగారం స్వాధీనం

● నిందితుడి అరెస్టు

● 12 గంటలలోపు కేసును ఛేదించిన పోలీసులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున ఇంటి బయట పనిచేసుకుంటున్న ఓ మహిళను చంపుతానని బెదిరించి ఆమె వద్ద ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలతో ఓ వ్యక్తి పరారీ అయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు రెండు టీంలుగా ఏర్పడి, సీసీ కెమెరాల సహాయంతో పలు ప్రాంతాల్లో గాలించి, నేరం జరిగిన 12 గంటలలోపు నిందితున్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక టుటౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ భావన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులో నివాసం ఉంటున్న తుమ్మలపెంట సుబ్బయ్య భార్య ప్రభావతి ఆదివారం తెల్లవారుజామున 4.45 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద పనిచేసుకుంటుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి తలకు మంకీ క్యాపు, చేతులకు గ్లౌజులు ధరించి ఆమెను చంపుతానని బెదిరించి బంగారు తాళిబొట్టు సరడు, నాలుగు బంగారు గాజులను అపహరించి ద్విచక్ర వాహనంలో పరారీ అయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక టుటౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఉదయం కేసు నమోదు అయింది. సంఘటన అనంతరం డీఎస్పీ ఆధ్వర్యంలో టుటౌన్ సీఐ ఎం. యుగంధర్, ఎస్ఐలు జే. ధనుంజయుడు, ఆర్. రాఘవేంద్రారెడ్డి రెండు గ్రూపులుగా ఏర్పడి నిందితుని కోసం పలు కోణాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలో అమర్చిన సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితులను ప్రశ్నించి వివరాలు సేకరించారు. సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో టుటౌన్ బైపాస్ రోడ్డులోని మానస రెస్టారెంట్ పక్కనగల మారుతీ అపార్టుమెంట్‌కు వెళ్లే దారిలో స్థానిక ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన ఉచ్చుగారి రసూల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇతని వద్ద ప్రభావతి నుంచి అపహరించిన మొత్తం 12 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని బజాజ్ డిస్కవరీ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.10 లక్షలు అవుతుందని వివరించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భావన, స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు



● కక్ష సాధింపుకోసమే నేరం

బాధితురాలు ప్రభావతి భర్త సుబ్బయ్య స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఇతని వద్ద నిందితుడు రసూల్ రెండు సంవత్సరాలుగా గుమస్తాగా పనిచేస్తున్నాడు. రసూల్ తన ముక్కుకు ఆపరేషన్ చేయించుకునేందుకు జనవరి 1వ తేదీ నుంచి గుమస్తా పనికి రాలేదు. డిసెంబరు నెల జీతంతో పాటు ఆపరేషన్‌కోసం అదనంగా రూ.10 వేలు ఇవ్వమని యజమానిని అడిగాడు. దీంతో యజమాని సుబ్బయ్య ఆపరేషన్ చేయించుకుని రాపో తర్వాత ఇస్తానని చెప్పగా.. శస్త్ర చికిత్స చేయించుకున్న తర్వాత రసూల్ తనకు రావాల్సిన జీతం అడిగాడు. దీంతో యజమాని తర్వాత ఇస్తాననంటూ వాయిదాలు వేస్తూ వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎలాగైనా సుబ్బయ్యను ఇబ్బంది పెట్టాలని నిర్ణయించుకుని ఆదివారం తెల్లవారుజామున సుబ్బయ్య తన కిరాణా షాపు వద్ద ఉండగా చూసి ఎవరూ గుర్తు పట్టకుండా మంకీ క్యాంపు, చేతులకు గ్లౌజులు ధరించి ఆయన ఇంటి వద్దకు వెళ్లి అతని భార్య ప్రభావతిని బెదిరించి బంగారు ఆభరణాలను అపహరించినట్లు డీఎస్పీ వివరించారు. నేరం జరిగిన 12 గంటలలోపు నిందితున్ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి అపహరించిన సొత్తును స్వాధీనం చేసుకుని కేసును ఛేదించిన సంఘటనలో టుటౌన్ సీఐ ఎం.యుగంధర్, ఎస్ఐలు ధనుంజయుడు, రాఘవేంద్రారెడ్డి, కానిస్టేబుళ్లు ఎం. రవీంద్రనాయక్, బి.మహబూబ్‌బాష, వి.బాబాఫక్రుద్దీన్‌ను డీఎస్పీ అభినందించారు.

బాధిత కుటుంబానికి సాయం



మృతుని తండ్రికి ఆర్థిక సాయం అందచేస్తున్న టీడీపీ నేత మల్లికార్జుననాయుడు

మదనపల్లె, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలో శనివారంరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధితుడి కుటుంబానికి తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త కోఫూరి మల్లికార్జుననాయుడు రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని ఎర్రసాని వారిపల్లె పంచాయతీ వక్కలవారిపల్లెకు వెళ్లి నల్లసాని కోటేశ్వరరావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రమాదంపై ఆరా తీసిన మల్లికార్జుననాయుడు.. దహన సంస్కారానికి మృతుని తండ్రికి రూ.10 వేలు నగదు అందజేశారు. ఇందులో కురబలకోట మండల పార్టీ అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్, రాజారెడ్డి, శివలింగారెడ్డి, గణేష్, శివకుమార్, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

భూ వివాదంలో దంపతులపై దాడి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) భూవివాద గొడవలో దంపతులపై దాడి జరిగిన సంఘటన పెద్దమండ్యం మండలంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. మండలం లోని సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీ చిన్ననాయనగారిపల్లి లో నరసింహులునాయుడు, లక్ష్మీపతి నాయుడు ల మధ్య భూవివాదాలున్నాయి. రెండు రోజుల క్రితం చెలరేగిన ఈ గొడవలో నరసింహులు నాయుడు, ఉమామహేశ్వరమ్మ దంపతులపై లక్ష్మీపతి నాయుడు మరో నలుగురు ఆయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఉమామహేశ్వరమ్మ తీవ్రంగా కావడంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించి అనంతరం ఆమెకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లినట్లు పెద్దమండ్యం పోలీసులు తెలిపారు.

కమనీయం...శ్రీనివాసుడి కల్యాణం

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా ఆదివారం శ్రీనివాసుడి కల్యాణం కమనీయంగా జరిగింది. గత ఐదు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం నిత్య కైంకర్యాలు పూర్తి చేసుకున్న అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి వారు సర్వభూపాల వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం టీటీడీ వేదపండితులు వేదమంత్రోచ్చారణలు మంగళవాయిద్యాలు, అన్నమయ్య సంకీర్తనల నడుమ తిరుమలేశుడి పరిణయం నయన మనోహరంగా జరిపించారు. అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు శ్రీనివాసుడి కల్యాణాన్ని తిలకించి తరించారు. భక్తజనం చేసిన గోవింద నామస్మరణలతో వేదిక ఆవరణం మార్మోగింది. స్వామి వారి కళ్యాణోత్సవంలో టీడీపీ ఇన్‌చార్జి దాసరి



శ్రీవారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు, కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

పల్లె జయచంద్రారెడ్డి, కల్పనారెడ్డి దంపతులు, ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, అరుణ దంపతులు, మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి,సిద్దమ్మ, క్లస్టర్ ఇంచార్జి బేరి శ్రీనివాసులు, సోముశేఖర్, ఆదిరెడ్డి, ఆనందనాయుడు, శివరాం, జయరాంరెడ్డి, రవిచంద్ర, కేశవరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై దేవదేవుడు

కల్యాణం అనంతరం దేవదేవుడు తన ఇష్ట వాహనమైన గరుత్మంతునిపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. వందలాది మంది భక్తులు గరుడ వాహనంపై స్వామి వారిని దర్శించుకుని ఆధ్యాత్మిక తన్మయత్వం చెందారు. ఆలయ సిబ్బంది భక్తులకు టీటీడీ లడ్డూలను పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం రథోత్సవం, గజవాహనసేవ నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, సిబ్బంది నగేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ములకలచెరువు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురకాయలకోట జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 1992-93 లో పదో తరగతి చదుకున్న విద్యార్థులు 32 ఏళ్ళ తరువాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలు, గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సభాపతి, చంద్రశేఖర్, సర్దార్‌బేగ్‌లను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులు బషీరున్, మహమ్మద్ అలీ రెడ్డిశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, జయరాంరెడ్డి, నరసింహులు, ప్రసాద్, వెంకటేషు, సుబ్రమ్యం, లవకుమారి, కుళాయమ్మ, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

భారత షూటింగ్ బాల్ క్రీడాకారుడికి సన్మానం



యూసఫ్ బాషాను సన్మానిస్తున్న తంబళ్లపల్లె పెద్దలు, యువత

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): షూటింగ్ బాల్‌లో భారత జట్టులో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన మహమ్మద్ యూసఫ్ బాషాను పెద్దలు, యువత ఆదివారం ఘనంగా సన్మానించారు. తంబళ్లపల్లెకు చెందిన యూసఫ్ బాషా జనవరిలో నేపాల్‌లో జరిగిన రెండో ఏషియన్ చాంపియన్‌షిప్ షూటింగ్ బాల్‌లో భారత జట్టులో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా కప్పు సాధించిన తర్వాత మొదటి సారిగా స్వస్థలం తంబళ్లపల్లెకు వచ్చిన యూసఫ్ బాషాను స్థానిక పెద్దలు, యువకులు ఘన స్వాగతం పలికి దుశ్శాలువలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..యూసఫ్ బాషా భారత షూటింగ్ జట్టులో సభ్యుడు కావడం తంబళ్లపల్లెకు గర్వకారణమన్నారు. యువ క్రీడాకారులు యూసఫ్ బాషాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు బక్సుసాబ్, నాగరాజుశెట్టి, రషీద్‌బాష, అల్తాఫ్, మస్తాన్, యువకులు తదితరులు ఉన్నారు.

'సీపీఆర్ మంగళ' అపార్ట్‌మెంట్ ప్రీ బుకింగ్ ప్రారంభం



సీపీఆర్ అపార్టుమెంట్ ప్రీ బుకింగ్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్లు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మంగళం పరిధిలో అధునాతనంగా నిర్మించిన 'సీపీఆర్ మంగళ' 2బీకే అపార్టుమెంట్ ప్రీ బుకింగ్‌ను ఎండీ కేవీ చలపతి ఆదివారం ప్రారంభించారు. కరకంబాడి రోడ్డులోని ఎంఆర్ఎఫ్ షోరూం ఎదురుగా సీపీఆర్ అపార్టుమెంట్ ప్రత్యే క ఆకర్షణీయంగా నిలుస్తోందన్నారు. ప్రీమియం లొకేషన్, మోడర్న్ డిజైన్, ఆర్కిటెక్చర్, సెక్యూరిటీ, సేఫ్టీ, పార్కింగ్, క్లబ్‌హౌస్, పార్కు, పాఠశాలలు, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్‌కు అత్యంత సమీపం లో ఉందని వివరించారు. ఆరంభ ధర రూ.37లక్షలుగా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు 9492013322/66/88 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ ప్రారంభోత్సవంలో డైరెక్టర్లు కాశీ, లోకేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను పరిమితి పెంపు హర్షణీయం



మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆదాయపన్ను పరిమితిని కేంద్ర ప్రభుత్వం 12 లక్షలకు పెంచడం మధ్యతరగతి సీనియర్ సిటిజన్లకు ఊరటనిచ్చిందంటూ ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక జీఆర్టీ ఉన్నత పాఠశాలలో ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ, మాట్లాడుతూ ఇటీవల ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లో ఆదాయం పన్ను రూ. 12 లక్షలకు పెంచడంతో 90 శాతం విశ్రాంత ఉద్యోగులకు ఓవరంలాంటిదన్నారు. 70 ఏళ్లు నిండిన వయోవృద్ధులకు ఆయుష్మాన్ యోజన పథకం ఎంతో మేలుకలుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ ఉస్మాన్ సాహెబ్, ఆర్గనైజర్ కృష్ణమూర్తి, సలహాదారులు ప్రొఫెసర్ శ్రీనివాసులు, డాక్టర్ గొల్లపుడి తిరుపతిరావు రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి, జగన్‌మోహన్, నాగరాజ, ధనలక్ష్మీ, ప్రేమ, రాజేంద్ర తదిరతులుపాల్గొన్నారు.

ఎన్‌పీటీఈఎల్‌లో మిట్స్‌కు ర్యాంకింగ్



అవార్డును అందుకుంటున్న పృద్వీరాజన్

కురబలకోట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్‌పీటీఈఎల్‌లో ఏఏఏ ర్యాంకింగ్ దక్కినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. ఎన్‌పీటీఈఎల్ మద్రాసు ఐఐటీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలను నిర్వహిస్తారు. కాగా గతేడాది జూలై నుంచి డిసెంబరు దాకా 7480మంది దరఖాస్తు చేసుకోగా 5734 మంది ఉత్తీర్ణత సర్టిఫికెట్లను సాధించారు. కాగా కళాశాలకు ఏఏఏ ర్యాంకింగ్‌తో పాటుగా జాతీయ స్థాయిలో టాప్ 12 స్థానం దక్కింది. 90మంది గోల్డ్ రేటింగ్, 1024మంది సిల్వర్, 2765మంది ఎలైట్ సర్టిఫికెట్లను పొందారు. చెన్నై ఐఐటీలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి పృద్వీరాజన్ ఈ అవార్డును అందుకున్నాడు. ఈ ర్యాంకింగ్ రావడంతో కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, చైర్మెన్ ఎన్.ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్ తదితరులు అభినందించారు.

వీసీకే, బాస్ పట్టణ అధ్యక్షుల ఎన్నిక



నూతన అధ్యక్షులుగా ఎన్నికైన రెడ్డిప్రసాద్, పఠాన్ ఇర్ఫాన్‌ఖాన్‌లతో బాస్‌అధినేత పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వీసీకే, బాస్ పట్టణ అధ్యక్షులను ఎన్నుకున్నారు. స్థానిక తాళ్లవారివీధిలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం వీసీకే, బాస్ పట్టణ కమిటీల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఇందులో వీసీకే పట్టణ అధ్యక్షునిగా రెడ్డిప్రసాద్, బాస్ పట్టణ అధ్యక్షునిగా పఠాన్ ఇర్ఫాన్‌ఖాన్‌ను ఎన్నుకున్నారు. బాస్ జిల్లా కార్యదర్శి పెద్దపాలెం రవిశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ బాధ్యతలు అప్పగించిన బాస్ నేత పీటీఎం శివప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈసమావేశంలో బాస్ నాయకులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, ముత్యాల మోహన్, రవిశంకర్, వై.చిన్నా, తలారి కృష్ణ, జనార్దన్, వై.గంగాధర్, జీవీ రమణ, డేగాని రమణ, రాయల్ సూరి, సద్దుల శశికుమార్, రెడ్డిశేఖర్, ఈశ్వర్, బి.నరసింహులు, బి.సురేష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

భూఆక్రమణలను అడ్డుకున్న అధికారులు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) భూ ఆక్రమణలు అరికట్టాలని మండలం లోని మిట్టవాండ్లపల్లి బస్టాఫ్ సమీపం తారురోడ్డు పక్కన ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమణకు యత్నించగా అధికారులు అడుకున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఆర్‌అండ్‌బీ శాఖ సిబ్బంది అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామాలలో వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

ఉపాధిలో పాత గుంతల్లోనే కొత్త పనులు



కొండయ్యగారిపల్లిలో పాత గుంతలలోనే పనులు చేస్తున్న దృశ్యం

నిమ్మనపల్లి ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వం వచ్చినా తమ పని మాత్రం మారదన్నట్టుగా ఉపాధి సిబ్బంది వ్యవహారశైలి కనిపిస్తోంది. ఇందుకు నిదర్శనంగా పాత గుంతలలోనే మళ్లీ పనులు చేపడుతూ వారికి తోచినంత దండుకొంటున్నారని పలువురు కూలీలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రైతుల పొలాల్లో పారంపాండ్స్, చెరువులలో క్యాంటిల్ ఫాండ్స్, ట్రెంచ్‌లు, కాలుకపూడికతీత, గడ్డి పెంపకం, పండ్లతోటల పెంపకం, పనులు చేపట్టాలి. అయితే పలు పంచాయతీల్లో చెరువులలో క్యాటిల్ ఫాండ్స్, పారంపాండ్స్ తవ్వకాలను పాత గుంతల్లోనే కూలీలకు ఒక రోజు పని కల్పించి మరుసటి రోజు నుం చి యంత్రాలతో పనుల చేపడుతున్నారన్న విమర్శలున్నాయి. ఇది ఇలాఉండగా రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా నే పాడి రైతుల సౌకర్యార్థం గోకులాలను కేటాయించింది. అయితే మండలానికి 25 గోకులాలు కేటాయించి వాటిని అర్హత కలిగి న పాడి రైతుకు ఇవ్వాల్సి ఉంటుంది. అయి తే ఏపీవో తన చేతి వాటం చూపించి పాడి ఆవులు లేని వారికి కూడా గోకులాలు మం జూరు చేసినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ఏపీవో రమేష్‌ను వివరణ కోరగా అలాం టివి ఏమీ జరగలేదని తెలిపారు. గోకులాలను స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రతిపాదించిన వారికే కేటాయించామని తెలిపారు.

ఆయాలకు రూ.18 వేల వేతనం చెల్లించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు నెలకు రూ.18 వేల జీతం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా ఉపాధ్యక్షుడు పీఎల్ నరసింహులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులోని ఈద్గాహ్ మైదానంలో ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పీలేరు నియోజకవర్గంలోని ఆయాల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ ఆయాలకు నెలకు కేవలం రూ.6 వేల గౌరవవేతనం చెల్లించడం దారుణమన్నారు. ఆయా లపై విద్యా కమిటీలు, స్థానిక రాజకీయ నాయకులు ఆజమాయిషీ, వేధింపులు లేకుం డా ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకుమునుపు వారు ఆయాలతో కలిసి స్థానిక పాతబస్టాండు నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు సురేశ్ కుమార్, వేణుగోపాల్, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు, సీపీఐ పీలేరు కార్యదర్శి టీఎల్ వెంకటేశ్, డప్పు కళాకారుల సంఘం నాయకుడు శ్రీనివాసులు, ఆయాల యూనియన్ నాయకురాళ్లు యశోదా, వెంకటరత్నమ్మ, విమల, నూర్‌జాన్, సుమతి, నేత్రావతి, వీరమ్మ, రత్నమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కలిసి రండి...పార్టీ కోసం కష్టపడి పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ములకలచెరువు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కలిసి రండి... తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అధ్వర్యంలో పార్టీ కోసం కష్టపడి పనిచేద్దామని టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ పేర్కొన్నారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పార్టీలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్ళామన్నారు. కావాలనే కొందరు వైసీపీ కోవలర్టులు టీడీపీ కుటుంబసభ్యుల మధ్య చిచ్చులు పెట్టి పార్టీని భ్రష్టుపట్టించాలని చూస్తున్నారని రాష్ట్ర అధ్యక్షుడు దృష్టికి తీసుకెళ్ళామన్నారు. ఒక సారి అందరితో మాట్లాడి తంబళ్లపల్లె ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి అధ్వర్యంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ సూచించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు, పార్టీ కోసం కష్టపడి పనిచేయడానికి ఎవరూ ముందుకొచ్చినా కలుపుకుపోతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎల్ఐసీ భాస్కర్‌రెడ్డి, పాల రాము, చాంద్‌బాషా, కట్టా హరినాథ్, సుబ్బినాయుడు, శ్రీనివాసులు, గణేష్, చెన్నకేశవులు, రెడ్డెప్ప, చాంద్‌బాషా, నీలకంఠారెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌పై ఆరోపణలు చేయడం తగదు

మదనపల్లె, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ ఎం.గురుస్వామిపై కొందరు డాక్యుమెంట్ రైటర్లు..ఆశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు, ఆరోపణలు చేయడం తగదని స్థానిక డాక్యుమెంట్ రైటర్లసంఘం అధ్యక్ష, కార్యదర్శులు రంగు గుణశేఖర్, ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కంగేరి నందా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హతలేని, యూనియన్‌లో సభ్యత్వం లేని కొందరు రైటర్లు..కార్యాలయంలో వారి పనులు జరగనందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయకూడని డాక్యుమెంట్లు పెడుతూ సబ్‌రిజిస్ట్రార్‌పై ఒత్తిడి చేస్తున్నారని గుణశేఖర్, కంగేరి నందా పేర్కొన్నారు. వాటిని ఎప్పటికప్పుడు తిరస్కరిస్తుండటంతో తట్టుకోలేని కొందరు రైటర్లు మీకు తరచూ ఫిర్యాదు చేస్తున్నారని, ఆశాఖ ఉన్నతాధికారులకు పంపిన వివరణలో పేర్కొన్నారు.

వెలగని వీధి దీపాలు.. ఆందోళనలో ప్రజలు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లెలోని మసీదు వద్ద గల కాలనీలో గత నెల రోజులుగా వీది దీపాలు వెలగడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గత నెల రోజులుగా సచివాల యంలో పని చేస్తున్న విద్యుత్ అసిస్టెంట్‌కు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వీధి దీపాలు వెలగక పోవడంతో రాత్రి వేళల్లో అంధకారంతోపాటు కాలనీలోనికి పాములు వస్తున్నాయని దీంతో బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నామన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు విసనకర్ర వాండ్లపల్లె కాలనీలో వీధి దీపాలను ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గాయపడిన నెమలికి చికిత్స

గుర్రంకొండ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ పట్టణం తూముకుంట రోడ్డు మార్గంలోని ఓ రైతు పొలంలో గాయపడిన నెమలికి ఆదివారం పశువైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. రైతు వివరాల మేరకు తూముకుంట రోడ్డుకు చెందిన ఓ రైతు పొలంలో ఆదివారం ఓ నెమలి కాళ్లకు గాయాలై ఎగురలేక, నడవలేని స్థితిలో ఉండడం గమనించి అటవీశాఖ అధికారులకు తెలిపారు. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు నెమలి పరిస్థితిని గమనించి పశువైద్య సిబ్బందికి తెలపడంతో ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం నెమలిని అటవీలో వదిలారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు రామ్‌మోహన్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రీ సర్వే ప్రక్రియ

కలకడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి):భవిష్యత్‌లో రైతులకు భూసంబంధిత సమస్యలు తలెత్తకుండా రీసర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఫణికుమార్ తెలిపారు. జేసీ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని గుడిబండ గ్రామంలో రీసర్వే జరిగినట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామ సరిహద్దు, పట్టాదారులు భూములను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ భార్గవి, సర్వేయర్ దేవి, వీఆర్వోలు దొరస్వామి, రామకృష్ణ, చైతన్యరెడ్డిలు పాల్గొన్నారు.

చైతన్య సేవా సంస్థకు సాయం



మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): చైతన్య సేవా సంస్థకు ఏటీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అప్పినపల్లె భాస్కరాచారి ఆదివారం సాయమందించారు. చైతన్య సేవా సంస్థకు వెళ్లి ముత్తు స్కూల్‌ను సందర్శించి రెండు క్వింటాల్ బియ్యంను వితరణగా అందజేశారు. సంస్థలోని వృద్ధుల, పిల్లల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎంపీ ఆనందన్, గిరిజమ్మాల్, కవిత, చరణ్, తదితరులు పాల్గొన్నారు.